సాక్షి పల్నాడు


ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



మహాలక్ష్మి గుండెపాటమ్మ తిరునాళ్ల
రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు గ్రామ దేవత మహాలక్ష్మి గుండెపాటమ్మ అమ్మవారి తిరునాళ్ల శనివారం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రవికిరణ్ పాల్గొన్నారు.



విస్తృతంగా వాహనాల తనిఖీలు
భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం భట్టిప్రోలు చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక బృందానికి చెందిన అధికారిణి జ్యోతి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 507.50 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

రేపు కావటి మనోహర్ నాయుడు నామినేషన్



చిలకలూరిపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఉదయం 8.30 గంటలకు భారీ ర్యాలీగా నామినేషన్ వేసేందుకు బయలుదేరతారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ ఎన్‌ఆర్‌టీ సెంటర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, చౌత్రా సెంటర్, కళామందిర్ సెంటర్, కేబీరోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటుంది. తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు. కార్యక్రమానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారు. నామినేషన్ సందర్భంగా నిర్వహిస్తున్న భారీ ర్యాలీకి నియోజకవర్గం నుంచి పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని పార్టీ వర్గాలు కోరాయి.

నిఘా తీవ్రం చేయండి

మాచర్ల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డెప్యూటీ కమిషనర్ కె. హేమంత్ నాగరాజు శనివారం సిబ్బందితో కలసి మాచర్ల, విజయపురిసౌత్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయపురిసౌత్ బోర్డర్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేశారు. అక్రమంగా మద్యం రవాణా కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేపట్టాలని చెప్పారు. ఆయన వెంట మాచర్ల సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.పి. కిశోర్, ఎం. రవీంద్రబాబు తదితరులున్నారు

జిల్లాలో 13 నామినేషన్లు దాఖలు

నరసరావుపేట: నరసరావుపేట పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాలకు శనివారం 13మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఒకరు పార్లమెంటుకు, మిగతా వారు అసెంబ్లీ స్థానాలకు దాఖలు చేశారు. నరసరావుపేట పార్లమెంటుకు డాక్టర్ గోదా రమేష్ కుమార్ (జాతీయ జనసేన పార్టీ), గురజాల అసెంబ్లీ నియోజకవర్గానికి కోయ రామారావు (ఇండిపెండెంట్), మాచర్లలో యర్రమాల రామచంద్రారెడ్డి, యర్రమాల కృష్ణవేణి(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), దేగల సైదారాజు(ఇండిపెండెంట్)గా నామినేషన్లు దాఖలు చేశారు. పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి నంబూరు వసంతకుమారి (వైఎస్సార్‌సీపీ), గౌతుకట్ల అంకమ్మరావు, నంబూరు కల్యాణ చక్రవర్తి(ఇండిపెండెంట్లు), పమిడి నాగేశ్వర రావు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), నరసరావుపేట అసెంబ్లీకి షేక్ మహబూబు మంజూరు (ఇండిపెండెంట్), బూదాల బాబూరావు(బీఎస్పీ), సత్తెనపల్లి నియోజకవర్గానికి షేక్ దరియావలి (ఇండిపెండెంట్), జొన్నలగడ్డ విజయకుమార్ (జైభీమ్‌రావు భారత్‌పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు.

చెల్లిని రక్షించబోయి..

- అన్న, స్నేహితుడు గల్లంతు
- అడిగొప్పల సమీపంలోని సాగర్ కుడికాల్వ వద్ద ఘటన

దుర్గి: చెల్లిని రక్షించబోయి అన్న, అతని స్నేహితుడు ఇద్దరు గల్లంతైన ఘటన మండలంలోని అడిగొప్పల సమీపంలోని సాగర్ కుడి కాల్వలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన షేక్ మస్తాన్‌బీ అడిగొప్పల పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తగా పని చేస్తోంది. ఆమె కుమారుడు షేక్ ఇస్మాయిల్ రెండు రోజుల క్రితం అతని పుట్టినరోజు సందర్భంగా గుంటూరు నుంచి అడిగొప్పలకు అతని స్నేహితుడు షేక్ యూసఫ్ కలసి తల్లి మస్తాన్‌బీ వద్దకు వచ్చాడు. శనివారం సాయంత్రం సరదాగా గడిపేందుకు గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ కట్టకు కటుంబ సభ్యులంతా వెళ్లారు. వారంతా సరదాగా నీటి వద్ద గడుపుతుండగా వారి పక్కనే ఇస్మాయిల్ చెల్లెలు ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయింది, కాల్వలో పడిపోయిన చెల్లిని రక్షించేందుకు అన్న ఇస్మాయిల్, అతని స్నేహితుడు యూసఫ్ కాల్వలో దూకి చెల్లిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. అయితే ఇద్దరు కాల్వ నుంచి ఒడ్డుకు వస్తున్న క్రమంలో నీటి ప్రవాహవేగానికి కొట్టుకుపోయారు. స్నేహితులిద్దరు పదవ తరగతి పరీక్షలు రాశారు. ఇద్దరి వయస్సు 16 సంవత్సరాలు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కోటయ్య, పోలీసులు గల్లంతైనవారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఘటనా స్థలికి చేరుకుని ఉన్నతాధికారులతో మాట్లాడారు. కాల్వకు నీటి ప్రవాహం తగ్గించి గాలింపు చర్యలు చేపట్టాలని పీఆర్కే నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులకు సూచించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

స్మార్ట్ బడులు

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే తరగతి గదులు డిజిటల్ బాట పట్టాయి. ఒకప్పుడు కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమనుకున్న డిజిటల్ విద్య ఇప్పుడు మన ఊరిలోని సర్కారు బడిలో చదువుతున్న పేదింటి పిల్లలకు అందుబాటులోకి వచ్చింది. పాఠశాల స్థాయి నుంచే అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యను ఏపీ ప్రభుత్వం అందిస్తోంది. నాడు–నేడు ద్వారా బడుల రూపురేఖలను మార్చిన ప్రభుత్వం స్మార్ట్ తెరల ద్వారా బోధనల తీరునే మార్చేసింది.

- ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ స్క్రీన్ల ఏర్పాటు
- జిల్లాలో నాడు–నేడు పూర్తయిన 1,153 బడుల్లో 2,872 ఐఎఫ్‌పీ స్క్రీన్లు, 1,264 స్మార్ట్ టీవీలు
- ఆండ్రాయిడ్ బాక్స్, ఏపీ ఫైబర్ నెట్ ద్వారా డిజిటల్ బోధనలు
- 42,682 మంది ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల చేతుల్లో బైజూస్ ట్యాబ్‌లు



చిలకలూరిపేట మండలం బొప్పూడి ఉన్నత పాఠశాలలో స్మార్ట్ తెరలపై బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: జిల్లా వ్యాప్తంగా నాడు–నేడులో అభివృద్ధి చేసిన 1,153 ప్రభుత్వ పాఠశాలల్లో 2,872 ఇంరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ స్క్రీన్లు, 1,264 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 60 మంది విద్యార్థులకు ఒక స్మార్ట్ టీవీ, 6 నుంచి 10 తరగతులలో సెక్షన్‌కు ఒకటి చొప్పున ఐఎఫ్‌పీ ఏర్పాటు చేశారు. 65 అంగుళాల సైజు కలిగిన స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్) తరగతి గదిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ పాఠశాలల్లో ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా ఆయా పాఠశాలలకు 4జీ ఇంటర్నెట్ సర్వీస్ కేబుల్ సౌకర్యం కల్పించారు. ఐఎఫ్‌పీని బ్లాక్ బోర్డు, వైట్ బోర్డులా కూడా వాడుకోవచ్చు. ఈ బోర్డుపై రాసిన నోట్స్‌ను సేవ్ చేయవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా దీనిని కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకునే వీలు కూడా ఉంటుంది. ఈ స్మార్ట్ తెరలకు ఆండ్రాయిడ్ బాక్స్‌ల ద్వారా బైజూస్ కంటెంట్ స్క్రీన్‌పై చూపించే అవకాశముంటుంది. ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

ఇంటిలోనూ డిజిటల్ విద్య

తరగతి గదుల్లో చెప్పే స్మార్ట్ పాఠాలను ఇళ్లకు వెళ్లాక కూడా పిల్లలు మరింత క్షుణ్ణంగా, సులభంగా నేర్చుకునేందుకు వీలుగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసింది. ఇందులో భాగంగా రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధనలు చేస్తున్న సబ్జెక్టు టీచర్లకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఇలా ఇప్పటివరకు 39,989 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, 2,693 మంది సబ్జెక్టు టీచర్లకు 256 జీబీ మెమోరీగల ట్యాబ్‌లను అందజేశారు. వీటిలో 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్ సిలబస్ కూడా స్టోర్ చేసి ఉన్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తికి

	మొదటి విడతలో ఏర్పాటు చేసినవి	రెండో విడతలో ఏర్పాటు చేసినవి
పాఠశాలల సంఖ్య	446	707
ఐఎఫ్‌పీ స్క్రీన్లు	1,428	1,444
స్మార్ట్ టీవీలు	485	779

పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు పంపిణీ చేసిన ట్యాబ్‌ల సంఖ్య	
విద్యార్థులకు	39,989
ఉపాధ్యాయులకు	2,693

ఏఐ ట్యూటర్ అనే ప్రత్యేక యాప్ ప్రీలోడ్ చేసి ఉన్నారు. దీంతో ప్రపంచంలో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సర్కారు బడుల్లో వినియోగించిన ప్రభుత్వంగా ఖ్యాతినెక్కింది.

సులువుగా అర్థమవుతున్నాయి...



బైజూస్ కంటెంట్ ట్యాబ్‌ల వల్ల పాఠాలు సులువుగా అర్థమవుతున్నాయి. ఫొటోలు, వీడియోల రూపంలో చూడటంతో విషయాలను మరింత లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులు లేని సమయంలో ఇంట్లోనే ఉంటూ చదవుకునే అవకాశం ఉంది.

–అరిగెల ఆర్య వెంకట్, 9వ తరగతి విద్యార్థి, ఏపీ మోడల్ స్కూల్, దుర్గి

కలలో కూడా ఊహించలేదు



మా అబ్బాయి మణికంఠ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నాడు. తన పాఠశాలలో స్మార్ట్ తెరలపై పాఠాలు చెబుతున్నారు. ఇంటికి వచ్చాక ఆ పాఠాలను బైజ్యూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌ల ద్వారా చదువుకుంటున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో ఇంత సాంకేతిక విప్లవం వస్తుందని కలలో కూడా అనుకోలేదు. పేదింటి పిల్లల చదువులకు ఈ ప్రభుత్వం చూపిన శ్రద్ధకు నిదర్శనం స్మార్ట్ చదువులు. కార్పొరేట్ బడుల్లోనూ ఇలాంటి సదుపాయాలు లేవు.

–బత్తుల శ్రీనివాసరావు, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం.



సత్తెనపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ట్యాబ్‌ల ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థి (ఫైల్)

గిరిదుర్గంపై అనవేముని కాంస్య విగ్రహం



యడ్లపాడు: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడుకోట గిరిదుర్గంపై అద్దంకి రెడ్డిరాజుల్లో సుప్రసిద్ధుడైన అనవేమారెడ్డి భారీ కాంస్య విగ్రహం కొలువుదీరింది. రూ.12 లక్షల వ్యయంతో రూపొందించిన 13 అడుగుల ఎత్తు కలిగిన ఈ విగ్రహాన్ని కొండపై నాలుగు కూడళ్ల నడుమ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ ఉన్న తొమ్మిది అడుగుల ఫైబర్ విగ్రహాన్ని తొలగించి దాని స్థానంలో ప్రతిష్ఠించారు. కొండపై పురాతన మసీదు ఎదురుగా ఉన్న ఐదు అడుగుల రాతి చట్టుపై ఏడు అడుగుల దిమ్మెను నిర్మించి ఈ భారీ విగ్రహాన్ని ఉంచారు. తూర్పు గోదావరి జిల్లా అనకాపల్లి సమీపంలోని వానపల్లి గ్రామంలో లభ్యమైన 13వ శతాబ్దపు రాగి శాసనంలో కొండవీడు రాజ్యంలోని రాజ దర్బారులో రత్న సింహాసనంపై అధిరోహించి నిత్యం నిర్వహించే రాచకార్యాలను ప్రస్ఫుటించేలా ఈ దిమ్మెకు మూడు వైపులా అనవేముని పాలనా వైభోగ విశేషాలను సందర్శకులకు తెలియజేసేలా తెలుగు, ఆంగ్లభాషల్లో రాయించారు. నిత్యం ఆరుసార్లు శివపూజ చేసే గొప్ప శైవభక్తుడైన అనవేముడు కొండవీడులో వసంతోత్సవాలను విరివిగా జరిపించేవాడు. ప్రజలపై కర్పూర ఖండాలను చల్లి 'కర్పూర వసంత రాయుడై, దేశ పట్టాభిషిక్తుడయ్యాడు. కవుల్ని, గాయకుల్ని పోషించి కవిగాయక కల్పతరుగా నిలిచాడు. ఓటమి ఎరుగని ధీరుడిగా, ప్రజా రంజకంగా పరిపాలించి ధర్మవేమనగా కీర్తిప్రతిష్ఠలు సాధించాడు. అద్దంకి నేల రాజధాని తొలగించి శతృదుర్భేద్య గిరిదుర్గ రాజధానిగా తీర్చిదిద్దిన నిర్మాతల్లో ఒకడు. అద్దంకి రెడ్డిరాజుల రెండో రాజధానిగా ఏర్పాటు చేశాక అనవేముని సుపరిపాలన గావించినందున ఆయన విగ్రహాన్ని స్థాపించినట్లు కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు.

బడుగులకు అగ్రభాగం



ముస్లిం మైనార్టీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి (ఫైల్)

- పదవుల్లో సముచిత స్థానం
- టీడీపీ హయాంలో ఒక సామాజిక వర్గానికే పీట
- వైఎస్సార్ సీపీ హయాంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం
- హర్షం వ్యక్తంచేస్తున్న ఆయా వర్గాలు

గురజాల: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రాజ్యాధికారంలో బడుగులకు అగ్రస్థానం లభించింది. అధికారం చేపట్టిన అయిదేళ్లలో సమాజంలోని బిసి, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ వర్గాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాధాన్యత కల్పించారు. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాల్లో పనిచేస్తున్నటువంటి పార్టీ నాయకులకు, స్థానిక సంస్థల పదవులు, నామినేటెడ్ పదవులు ఇతరత్రా ప్రభుత్వ అనుబంధ విభాగాల పదవులు బడుగు వర్గాలకు కట్టబెట్టారు. 50శాతంకు పైగా పదవులు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలకు అందించారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి విధేయులుగా ఉన్న వారికి వారి నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పలు రూపాల్లో స్థానం కల్పించడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తచేస్తున్నారు.

టీడీపీ హయాంలో మొండిచెయ్యి...
గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నియోజకవర్గంలోని బడుగులకు చంద్రబాబునాయుడు మొండి చెయ్యి చూపారు. ఆయా వర్గాల్లోని ఎవరికి ఏరకమైన పదవులు కేటాయించలేదు. కేవలం ఆ పార్టీ సొంత సామాజిక వర్గానికి చెందిన వారికి పదవులు కేటాయించి మిగిలిన వారి పట్ల వివక్ష చూపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ , ముస్లీం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుని వదిలేశారు. ఆ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని సైతం పట్టించుకోకుండా మొండిచెయ్యి చూపారు. జెండా పట్టుకుని పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన తమకు మిగిలింది శూన్యమేనని ఆ పార్టీకి చెందిన నేతలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు 50శాతం పదవులు బడుగులకు అందించడం మంచి పరిణామమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో పదవులు ఇలా...
నియోజకవర్గంలోని దాచేపల్లి, గురజాల, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల విషయంలో చిన్న చూపుచూసింది. కానీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుపేదలకు పట్టం కడుతూ సామాజిక భావన పెంపొందించేలా పదవులు అందించారు. టీడీపీ హయాంలో నలుగురికి మాత్రమే పదవులు ఇవ్వగా, వైఎస్సార్ సీపీ మాత్రం 33 మందికి పదవులు అందించారు.

నియోజకవర్గంలో పదవులు ఇలా..

కులాలు వారీగా	టీడీపీ హయాంలో	వైఎస్సార్ సీపీ హయాంలో
ముస్లింలకు	0	6
ఎస్సీలకు	2	7
బీసీలకు	1	8
ఆర్యవైశ్యులకు	1	5
వడియరాజులకు	0	4
యాదవరాజులకు	0	3
మొత్తం	4	33

ఎమ్మెల్యే చొరవతోనే చైర్మన్ అయ్యాను..



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతోనే మార్కెట్ యార్డు చైర్మన్ అవకాశం లభించింది. ఇచ్చిన మాటకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేషరెడ్డిలు నెరవేర్చుకునే లక్షణాలు ఉన్నాయి. ప్రతి కులానికి న్యాయం చేయాలనే ఆలోచన విధానం బాగుంది. గతంలో ఎన్నడూ ఎప్పుడు ఈ విధంగా పదవులు బడుగులకు ఇవ్వలేదు. మొదటి సారిగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో మాకు పదవులు వచ్చాయి.

కలకండ అంద్రెయ్య, చైర్మన్, దాచేపల్లి–గురజాల మార్కెట్ యార్డు

తగిన ప్రాధాన్యం



ముస్లీం మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు వైఎస్సార్ సీపీలో తగిన ప్రాధాన్యం వుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాల వారికి 50శాతం అవకాశం కల్పిస్తూ ప్రతి ఒక్కరిని ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ప్రతి ఒక్క కులానికి ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగడం ఆనందదాయకం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటాం.

షేక్ బడేజానీ, వైస్ చైర్మన్ గురజాల నగర పంచాయతీ

ట్రయల్‌రన్





నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలు నిర్వహణలో భాగంగా శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ ఈవీఎంల తరలింపు, పోలింగ్‌స్టేషన్ల వారీగా సిబ్బందిని బస్సుల ద్వారా తరలింపుపై కలెక్టరేట్‌లో మార్క్ ట్రయల్‌రన్ నిర్వహించారు. ప్రత్యక్షంగా పరిశీలించి దీనికి ఎన్ని ఆర్టీసీ, స్కూలు బస్సులు అవసరమవుతాయో అనే అంశాన్ని క్షుణంగా పరిశీలించారు. దీనిపై రవాణాశాఖ అధికారులతో చర్చించి సూచనలు చేశారు. ట్రైనీ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, ఈవీఎం నోడల్ అధికారి అజయ్‌కుమార్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాస్, ఆర్టీఓ పరంధామరెడ్డి పాల్గొన్నారు.

పిఠాపురంలో పవన్‌ను చంద్రబాబే ఓడిస్తారు

- ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్
- అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డితో కలసి దాచేపల్లిలో ప్రచారం
- బ్రహ్మరథం పట్టిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, పక్కన అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: పిఠాపురంలో పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని చంద్రబాబే దగ్గరుండి ఓడిస్తారని వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ఆయన అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డితో కలసి శనివారం రాత్రి దాచేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దాచేపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ప్రతి ఒక్కరిని పేరు పేరున ఆప్యాయంగా పలకరించారు. అనంతరం బొడ్రాయిసెంటర్, జమ్మిచెట్టు సెంటర్‌లలో జరిగిన సభలలో అనిల్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు సీఎంగా పనిచేసిన చంద్రబాబు సచివాలయం, వలంటీర్ వ్యవస్థను ఎందుకు తీసుకురాలేదని, జగనన్న తెచ్చిన ఈ వ్యవస్థలను తాను కూడా కొనసాగిస్తానని చంద్రబాబు చెబుతూ జగనన్న పాలనను మెచ్చుకుంటున్నారని అన్నారు. ముస్లింలకు వైఎస్సార్ అమలు చేసిన నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ అగ్రనేతలు బహిరంగంగా చెబుతుంటే చంద్రబాబు మాత్రం మోదీ, అమిత్‌షా కాళ్లు పట్టుకుని పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. చంద్రబాబు కేవలం పొత్తులను నమ్ముకునే ఎన్నికల బరిలో నిలిచారని, జగనన్న మాత్రం దేవుడ్ని, ప్రజలను మాత్రమే నమ్ముకుని ఒంటరిగా పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. తనను, మహేష్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మంచి పనులు చేశాం..
నిండు మనస్సుతో ఆశీర్వదించండి
పొత్తులతో వస్తున్న చంద్రబాబు దొంగల ముఠాకి ఓటేస్తే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారని అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన యరపతినేని నియోజవకర్గంలో ఒక్క మంచి పని కూడా చేయలేదని, మళ్లీ తనను గెలిపిస్తే ఏడాదికి ఒక్క సిలిండర్ ఇస్తానని మోసం మాటలు చెబుతున్నాడని అన్నారు. యరపతినేనిని నమ్మి ఓట్లు వేస్తే మోసపోతారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి జరిగిన మంచిని, మేలుని గుర్తు చేసుకుని మరోసారి ఎంపీగా అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు చింతలపూడి శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభానీ, కోట కృష్ణ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మందపాటి రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

- సర్వం సిద్ధం
- తరలిరానున్న భక్తులు
- దేవాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు



శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి మూలవిరాట్

మాచర్ల: పల్నాడులో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆదివారం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా ముందుగా అంకురార్పణతో ప్రారంభమౌతాయి. అందులో భాగంగా మొదటి రోజు ఆలయ అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు, ఈఓ సాంబయ్య, ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. 22న ధ్వజారోహణ, 23న కల్యాణోత్సవం, 24న హనుమద్వాహనం, 25న శేషవాహనంపై స్వామి వారిని ఊరేగిస్తారు. 26న గరుడవాహనం, 27న రవిపొన్నవాహనం, 28న రథోత్సవం నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత నడుమ శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి తిరునాళ్ల నిర్వహించనున్నారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు, అర్బన్ సీఐ శరత్‌బాబు ఆధ్వర్యంలో రథోత్సవంలో ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. 29న అశ్వవాహనం, 30న శుకవాహనం, మే 1వ తేదీన పుష్పయాగం, 2వ తేదీన ద్వాదశ ప్రదక్షిణలు, 3న ఏకాదశ కలశ స్థాపన, 4న పవళింపు సేవ, 5వ తేదీన 16 రోజుల పండుగతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఇందులో కీలక ఘట్టాలు కల్యాణం, రథోత్సవం. అనేక దశాబ్దాలుగా ఈ బ్రహ్మోత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీ స్థాయిలో తరలిరావటం ఆనవాయితీ. అందుకనుగుణంగానే రూ.13లక్షల విలువైన షెడ్లు, వివిధ మరమ్మతు పనులు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను జయప్రదం చేసేందుకు దేవాలయాన్ని అలంకరించి ఏర్పాట్లు చేస్తున్నట్లు సాంబయ్య, నాగేశ్వరరావులు తెలిపారు.

క్లుప్తంగా

రిజిస్టర్‌లో ఎన్నికల ఖర్చు నమోదు చేయండి

వ్యవపరిశీలకులు గౌతమన్, జోసఫ్ జార్జి

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల రాజకీయ పార్టీల ఖర్చులు వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో ఎన్నికల నియమావళి నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు గౌతమన్, జోసఫ్ జార్జి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సహాయ వ్యయ పరిశీలన అధికారులతో ఎన్నికల ఖర్చుల మానిటరింగ్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు గౌతమన్, జోసఫ్ జార్జి మాట్లాడుతూ నిబంధన మేరకు రేట్ కార్డులలో ఉన్న రేట్లనే పరిగణించాలని సూచించారు. ఎప్పటికప్పుడు నివేదికలను సిద్ధం చేయాలని, ఎన్నికల విధులలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత మూడు రోజుల నుంచి నియోజకవర్గాల పరిశీలనలో భాగంగా తమ దృష్టికి వచ్చిన పలు అంశాలను కూలంకషంగా చర్చించారు. జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ వ్యయ పరిశీలకుల సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల విధులలో అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చీరలు, టీషర్టులు, ఇతర వస్తువుల పంపిణీలకు అనుమతులు ఇవ్వవద్దని సూచించారు. వ్యయ పరిశీలన అధికారి బాలసుబ్రమణ్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమ వివరాలను వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సుమిత్ కుమార్, సహాయ వ్యయ పరిశీలకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అచ్చంపేట తాత్కాలిక ఎంపీపీగా గంగసాని



అచ్చంపేట: ప్రస్తుత ఎంపీపీ భూక్యా రజనీభాయ్ తన వ్యక్తిగత కారణాలవల్ల తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజీనామాను ఆమోదించి, వైస్ ఎంపీపీగా ఉన్న గంగసాని నరశింహారెడ్డిని తాత్కాలిక ఎంపీపీగా నియమిస్తూ శనివారం జిల్లా పరిషత్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీవో కె. కుసుమకుమారి తెలిపారు. ఈ మేరకు గంగసాని నరశింహా రెడ్డి తాత్కాలిక ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించారు. అచ్చంపేట ఎంపీపీ ఎస్టీలకు రిజర్వు చేయబడింది. ప్రస్తుతం ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున తిరిగి ఎంపీపీ ఎన్నికలు నిర్వహించడం సాధ్యపడదు కనుక, కోడ్ ఎత్తేసేవరకు తాత్కాలికంగా గంగసాని నరశింహా రెడ్డి ఎంపీపీగా ఉంటారని, ఆ తదుపరి జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించి ఎస్టీ అభ్యర్థిని ఎంపీపీగా ఎన్నుకోవడం జరుగుతుందని ఎంపీడీవో చెప్పారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే ప్రతి కుటుంబానికి లబ్ధి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి
- రొంపిచర్లలో ఎన్నికల ప్రచారం



రొంపిచర్లలో ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందని పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనీల్ కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్ర వారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరిందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలను ఆధునీకరించామన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చామన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లకు నూతన భవనాలను నిర్మించామని, సచివాలయాల సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. రానున్న ఎన్ని కల్లో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేస్తున్న తమకు అమూల్యమైన ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని సూచించారు. గ్రామానికి వచ్చిన నేతలకు భారీగా జనం ఎదురేగి స్వాగతం పలికారు. అనీల్ కుమార్‌కు యాదవులు గొంగళితో సత్కరించి గొర్రెపిల్లను బహూకరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మ రెడ్డి, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి పరిశీలకులు పడాల శివారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ గద్దం వెంకటరావు, జెడ్పీటీసీ పిల్లి ఓబులురెడ్డి, మాజీ సర్పంచులు పడాల చక్రారెడ్డి, గెల్లి చినకోటి రెడ్డి, నాయకులు చపారపు గోపాలరెడ్డి, గుండాల వెంకటేష్, గెల్లి బ్రహ్మరెడ్డి, ఒద్దుల సుబ్బారెడ్డి, పల్లపు అంజయ్య, చపారపు సంజీవ రెడ్డి, సొసైటీ అధ్యక్షులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాదరణ కలిగిన ఏకైక నేత జగనన్న

- రానున్నది మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పెద్దమక్కెనలో ఎన్నిక ప్రచారానికి విశేష స్పందన



పెద్దమక్కెనలో పార్టీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజాదరణ కలిగిన ఏకైకనేత ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి అని, రానున్నది మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, నియోజవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలో శనివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు చేసి, సంస్కరణలు చేపట్టి పరిపాలనను ప్రజల వద్దకు చేర్చి, ఇచ్చిన మాట నిలబెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిరంగా నిలిచిపోయారన్నారు. గ్రామంలో గత ఐదేళ్లలో రూ. 30.93 కోట్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన రెండు ఓట్లను సత్తెనపల్లిలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌కు ఫ్యాను గుర్తుపై వేసి మమ్మల్ని గెలిపించాలన్నారు.

పలువురు పార్టీలో చేరిక

ఈ సందర్భంగా టీడీపీకి చెందిన గర్నెపూడి పుల్లారావు, ఇనకల్లు సుబ్బారావు, ఇనకల్లు వెంకయ్య, ఇనకల్లు వీరరాఘవయ్య, మరో 20 మంది టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరగా మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మ కాయల రాజనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమ రావు, వ్యవసాయ సలహ మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, స్థానిక నాయకులు వద్దుల రామకృష్ణారెడ్డి(బుల్లిబాబు), సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వద్దుల శ్రీనివాసరెడ్డి,నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

25న మాక్ పాలిసెట్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 25న మాక్ పాలిసెట్-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. శనివారం కళాశాలలో మాక్ పాలిసెట్ సమాచార పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాక్ పాలిసెట్‌కు హాజరు కావచ్చునని తెలిపారు. పరీక్షా రాసేందుకు ఎటువంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈనెల 25న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరగనున్న మాక్ పాలిసెట్‌కు హాజరయ్యేందుకు విద్యార్థులు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ కోసం హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

నరసరావుపేట: పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకై హెల్ప్‌డెస్క్‌లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ శనివారం పేర్కొన్నారు. నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ కోసం సామ్రాజ్యం, శ్రావ్యలను 62810 73020, 94903 09630లను సంప్రదించాలన్నారు. పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి టైపిస్టు నహమ్‌తుల్లా-63009 09696, చిలకలూరిపేటలో తహసీల్దార్ వరప్రసాద్-99490 96532, నరసరావుపేటకు ఏఓ వి.శ్రీనివాసరావు-99857 44342, సత్తెనపల్లికి తహసీల్దార్ లక్ష్మీ నరసింహారావు-99490 98622, వినుకొండలో డీటీ నాగరాజు-63008 23885, గురజాలకు ఎస్ఏ రామాంజనేయులు-82470 55270. మాచర్లకు తహసీల్దార్ కె.చంద్రశేఖర్-70329 29348లను నియమించామన్నారు. పోస్టల్ బ్యాలెట్ వసతి కోసం ఎన్నికల విధుల్లో ఉన్న ముఖ్యమైన శాఖల ప్రభుత్వ సిబ్బంది ఈ నియోజకవర్గాల్లోని నియమిత సిబ్బందిని సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వరవకట్టలో కార్డన్ సెర్చ్

- పత్రాలు లేని 60 వాహనాలు స్వాధీనం
- ముగ్గురు అనుమానితులపై బైండోవర్



కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న సీఐలు, సిబ్బంది



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

నరసరావుపేట టౌన్: వరవకట్టలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 60 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా శనివారం ఉదయం వరవకట్ట ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. అక్రమ మద్యం, నగదుపై సోదాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని 57 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే విధంగా అనుమానితులను ముగ్గురిని బైండోవర్ చేశామన్నారు. వాహనాలకు సంబంధించి యజమానులు పత్రాలు సమర్పించిన తర్వాత విడుదల చేస్తామన్నారు. దాడుల్లో రూరల్ సీఐ మల్లికార్జునరావు, టూటౌన్ సీఐ భాస్కర్, ఎస్ఐలు, సిబ్బంది, ప్రత్యేక బలగాలు తనిఖీల్లో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన చల్లగరిగ టీడీపీ కార్యకర్తలు



చల్లగరిగలో వైఎస్సార్ సీపీలో చేరినవారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: వైఎస్సార్ సీపీలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన వారిలో మందా వెంకటరత్నం, గాలియ్య, యేసు, శ్రీనివాసరావు, కొంద్రు రోశయ్య, సుధీర్, నగరికంటి పిచ్చయ్య తదితరులు పార్టీలో చేరారు.

కొండూరులో....

కొండూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బోరుపోతు రాజేష్, ఏసురత్నంలు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఎన్నికలలో తాము వైఎస్సార్ సీపీకి ఓటు వేయకపోయినా ఎలాంటి వివక్షత చూపకుండా, తాము టీడీపీ వారమని కూడా చూడకుండా అన్ని రకాల సంక్షేమ పథకాలు వచ్చాయన్నారు. ఎవరికి రూపాయి కూడా లంచం ఇవ్వకుండా నేరుగా తమ బ్యాంకు ఖాతాలలో పడ్డాయన్నారు. కోరికోరి మళ్లీ టీడీపీని గెలిపించుకోని కష్టాలపాలవ్వడం తమవల్ల కాదని, అందువల్లనే తామంతా వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని స్పష్టం చేశారు.

బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

ప్రభుత్వ విప్ పీఆర్కే



పీఆర్కే సమక్షంలో పార్టీలోకి చేరుతున్న జమ్మలమడక గ్రామ నాయకులు

మాచర్ల రూరల్: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు మళ్ళీ రావాలంటే జగనన్నే సీఎం కావాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జమ్మలమడక గ్రామానికి చెందిన 15 టీడీపి కుటుంబాల వారు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరిన సందర్భంగా వారు మాట్లాడారు. అట్టడుగు వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, రాజ్యాధికారమే ధ్యేయంగా జగనన్న పాలన సాగించాడని, ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు మరోసారి సీఎంను చేస్తాయన్నారు. ఎన్నికల్లో ఓట్లు, సీట్లు కోసం బూటకపు వాగ్దానాలతో కూటమి నాయకులు మన వద్దకు వస్తారని, వారి మాయమాటలు నమ్మవద్దని, ఎన్నికలలో ఓటమి పాలైతే నియోజక వర్గ దరిదాపులలోనూ కనిపించని టీడీపీ నాయకులు, ప్యాకేజీ తీసుకొని ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని, అలాంటి వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీలో చేరిన కామనబోయిన గోపాల్ స్వామి, ఈర్ల అంకారావు, ఈర్ల శివ, కనకయ్య, కామనబోయిన ముత్తయ్య, శివ, గంగులు, శ్రీనివాసరావు, పెద్ద శ్రీను, వెంకయ్య, ఈర్ల రాజు తదితర 15 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి ప్రభుత్వ విప్ పీఆర్కే సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, పోతిరెడ్డి కోటిరెడ్డి, మల్లెల శ్రీనివాసరావు, కామనబోయిన గోపీలున్నారు.